పాలకులకు ఆనందం.. అభ్యర్థులకు సంకటం


చిన్నారితో వెళ్తున్న తల్లి


బస్సులో సీటు కోసం వేచియున్న ఉపాధ్యాయులు


పాపతో వచ్చిన తల్లి

డీఎస్సీ పరీక్ష రాసి ర్యాంకులు సాధించిన వారిని ఒకచోట చేర్చి ఆనందం పొందాలనుకున్న పాలకుల నిర్ణయం.. అభ్యర్థులకు సంకటంగా మారింది. వందలమంది పిల్లా, పాపలతోనూ , మరింతమంది తల్లిదండ్రులను వెంటబెట్టుకుని అపసోపాలు పడి కడపకు రావాల్సి వచ్చింది. అంతటితో ఆగకుండా చలో విజయవాడ అంటూ ఆర్టీసీ బస్సుల్లో సీటు కోసం అవస్థ పడాల్సి వచ్చింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

క్లుప్తంగా

నగరంలో పారిశుద్ధ్యం అధ్వానం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరంలో ఎక్కడ చూసినా మురుగు పేరుకుపోయి పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి షేక్ మక్బూల్‌బాషా అన్నారు. నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షం కురిసినా మురికినీరు నిలబడి దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో గొంతు చించుకొని మాట్లాడిన ఎమ్మెల్యే నగర అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదని అన్నారు. కనీసం దోమల మందు పిచికారీ చేయలేని పరిస్థితిలో కార్పొరేషన్ అధికారులు ఉన్నారన్నారు.

రేపు చాకలి ఐలమ్మ జయంతి

కడప సెవెన్‌రోడ్స్: తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని ఈ నెల 26న నిర్వహిస్తున్నామని జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక నాయకులు గున్నాజయరాములు, ఎరికల మల్లయ్య, టి.నాగేశ్వరరావు, ఎస్వీ.రమణ తెలిపారు. కడప నగరంలోని తమ పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జయంతి సభ ఉంటుందని ప్రజా సంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైవీయూ స్కాలర్‌కు డాక్టరేట్ ప్రదానం


అర్జున్

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ స్కాలర్ కురవ అర్జున్‌కు బుధవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆ శాఖ ప్రొఫెసర్ సి.నాగరాజు పర్యవేక్షణలో హైబ్రీడ్ డీప్ లర్నింగ్ మోడల్స్ ఫర్ సెంటిమెంట్ అనాలసిస్ యూజింగ్ టెక్స్ అండ్ ఎమోజిస్ అంశంపై అర్జున్ చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ దక్కిందని వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కెఎస్వి.కృష్ణారావు తెలిపారు. అర్జున్ ప్రస్తుతం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సెయింట్‌జాన్స్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను వీసీ ఆచార్య అల్లంశ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పి.పద్మ, ప్రిన్సిపల్ జయరామిరెడ్డి అభినందించారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం


మాట్లాడుతున్న సీఐ ఈదురుబాషా

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే చిన్నారులు క్రమశిక్షణ అలవచుకోవాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ ఈదురుబాషా అన్నారు. కడప నగర శివారులోని భారత్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం శక్తియాప్ వినియోగం, పోక్సో చట్టం తదితర అంశాలను విద్యార్థులకు ఆయన వివరించారు. సూర్యప్రకాష్, సహదేవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంలో విద్యార్థులకు శిక్షణ


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్‌కేఆర్ – ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎడిబుల్ ఫంగల్ కల్చర్ విత్ రెఫరెన్స్ టు మష్రూమ్ కల్టివేషన్ కోర్సులో భాగంగా విద్యార్థులకు పుట్టగొడుగుల పెంపకంపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రిన్సిపల్ డాక్టర్ వేమల సలీంబాషా మాట్లాడుతూ భవిష్యత్తులో సొంతంగా పుట్టగొడుగులను పెంచి ఆదాయం పొందాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు స్పాన్ ఉపయోగించి బెడ్స్ తయారుచేశారు. కార్యక్రమంలో పి.సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్టోబరు 2వతేదీ వరకూ సెలవులివ్వాలి

కడప ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ప్రొసీడింగ్ ప్రకారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు అక్టోబరు 2వతేదీ వరకు దసరా సెలవులివ్వాలని పీఎల్‌టీయూ రాష్ట్ర కన్వీనర్ గడ్డంరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీచైతన్య, నారాయణ పాఠశాలు ఇప్పటివరకూ టీచర్లకు సెలవులివ్వక పోవడం దారుణం అన్నారు. కడప జిల్లాలోని బ్రాంచ్‌ల నుంచి ప్రైవేట్ టీచర్స్‌ను కడపకు రప్పించి విద్యాశాఖ అధికారుల అనుమతులు లేకుండా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మాదిగల సమస్యలపై నిరంతర పోరాటం


సభ్యులను సన్మానిస్తున్న బాబు, తదితరులు

కడప రూరల్: మాదిగ వర్గాల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎదురూరు బాబు తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మాదిగ సోదరులు తమ హక్కుల సాధన కోసం చైతన్య వంతం కావాలన్నారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా చిన్న సుబ్బయ్య, కడప నగర అధ్యక్షుడిగా పి.సునీల్‌కుమార్, కార్యదర్శిగా ఎస్.రాజును నియమించి, నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కొట్టం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సిటీ బస్సులు నడపాలని వినతి


ఆర్టీసీ ఆర్‌ఎంఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలో సిటీ బస్సులు నడపాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు మడగలం ప్రసాద్ కోరారు. కడప ఆర్టీసీ ఆర్ఎంఓ గోపాల్‌ను బుధవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా పెరుగుదలతో ఆర్టీసీ ప్రయాణాలు అధికమయ్యాయని, ఇందుకు అనుకూలంగా ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేవన్నారు. చాలామంది బస్సుల కోసం ఎదురుచూపులు చూడడమేగాక, పుట్‌పాత్ ప్రయాణాలు సాగిస్తున్నారన్నారు. నూతన బస్సులు మంజూరుచేయాలని రవాణా శాఖ మంత్రిని ఆర్‌సీపీ తరపున కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, చిన్న సుబ్బయ్య, పాల్గొన్నారు.

మహిళా పోలీసుల సమస్యలు పరిష్కరించాలి


ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ సభ్యులు

కడప కార్పొరేషన్: గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న మహిళా పోలీసుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు కోరారు. జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను బుధవారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసుల సమస్యలను ఆయనకు వివరించారు. ఎస్పీ స్పందిస్తూ అన్ని అంశాలకు పరిష్కారం లభించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న మస్తాన్ ,లక్ష్మణ్, కన్వీనర్ మస్తాన్, విజయ్ పాల్గొన్నారు.

వెంకట్‌సాయి ఎంటర్ ప్రైజెస్‌లో దసరా సంబరాలు


కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, షోరూం సిబ్బంది

కడప కార్పొరేషన్: కడప రామాంజనేయపురంలోని వెంకటసాయి ఎంటర్‌ప్రైజెస్ జాన్ డీర్ ట్రాక్టర్ల షోరూంలో ట్రాక్టర్ల మెగా డెలివరీ వేడుక రైతులతో కలిసి బుధవారం ఘనంగా ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.వెంకట్ మాట్లాడుతూ ప్రతి ట్రాక్టర్ కొనుగోలుపై రూ.30 వేల నుంచి రూ.1 లక్ష వరకూ, ప్రతి హార్వెస్టర్ కొనుగోలుపై రూ.1.50 లక్షల వరకూ జీఎస్టీ ప్రయోజనాలు కల్పిస్తున్నామన్నారు. వాటితోపాటు లక్కీ డ్రా నిర్వహించి 60 మందికి బహుమతులు గెలుచుకునే అవకాశాన్ని కల్పించామన్నారు. ట్రాక్టర్ల మెగా డెలివరీ సందర్భంగా 20 ట్రాక్టర్లను రైతులకు అందజేశారు. దూర ప్రాంత రైతులు 7729080222 ఫోన్ నంబర్‌కు డయల్ చేసి వివరాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతులు, షోరూం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు


వసతులు పరిశీలిస్తున్న జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్

కడప అర్బన్: కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం విద్యార్థులకు బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి, జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ బాలల సంరక్షణకు ఉన్న న్యాయ సేవలు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్, చైల్డ్ లైన్, ఉచిత న్యాయ సహాయం అంశాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం వసతిగృహ పరిసరాలు, జీవన పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, ఆహారం, మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. సమస్యలుంటే కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, స్పృహ పెంపొందించడంలో ఎన్‌ఎస్‌ఎస్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కళాశాలలోనేగాక, సమాజంలో మంచి పౌరులుగా నిలబడేలా ఈ సంస్థ మార్గనిర్దేశనం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంకాలనాగరాజు, రమేశ్‌యాదవ్, శివరామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టికోసం టీడీపీ వర్గీయుల ఘర్షణ

కడప అర్బన్: కడప నగర శివార్లలోని నానాపల్లి సమీపంలో మట్టిని తవ్వడం, అక్రమంగా తరలించడంలాంటి వ్యవహారంపై తెలుగుదేశం పార్టీలోనే ఇరువర్గాలుగా ఏర్పడి పరస్పర ఘర్షణలకు పాల్పడ్డారు. ఈ ఘర్షణలో మట్టిని తాము తరలించాలంటే, తాము తరలించాలనే వాదనతో దాడులకు పాల్పడినట్లు సమాచారం. మట్టిని తవ్వుతున్న జేసీబీ అద్దాలను పగులగొట్టినట్లు, ట్రాక్టర్‌లను అడ్డుకున్నట్లు సమాచారం. ఈ ఘర్షణ సమాచారం తెలుసుకున్న ఘటనాస్థలానికి చిన్నచౌక్ పోలీసులు వెళ్లి నివారించారు. ఐతే టిడిపి పార్టీకే చెందిన ఇరువర్గాల వారు మట్టి కోసం ఘర్షణ పడటం కడప నగరంలో చర్చనీయాంశంగా మారింది. పోలీసులు ఈ సంఘటనపై ఎలాంటి చర్యలను తీసుకుంటున్నారనే అంశంపై నోరు మెదపడంలేదు. తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదనీ తెలియజేశారు.

పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్: దసరా సెలవుల్లో సెలవులు ఇవ్వకుండా తరగతులను నిర్వహిస్తున్న పాఠశాల గుర్తింపు వెంటనే రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు, తెలుగు రాష్ట్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల జయరాజు, రాయలసీమ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండెల ఓబులేసు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించినప్పటికీ నిబంధనలను తుంగలో తొక్కి కడప నగరంలో తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. స్కూల్స్‌కు సెలవును ప్రకటించినా విద్యార్థులను, టీచర్లను తప్పకుండా రావాలని బలవంతం చేస్తున్నారని రాకుంటే ఫెయిల్ అవుతారని బెదిరిస్తున్నారన్నారు. కొన్ని పాఠశాలలు ఉపాధ్యాయులకు వర్క్‌షాప్, స్కూల్ వర్క్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీంతో ప్రైవేటు టీచర్లను మానసిక క్షోభకు గురి అవుతుండగా విద్యార్థులకు మానసికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటి కైనా విద్యాశాఖ అధికారులు స్పందించిన పాఠశాలలను నిర్వహిస్తే స్కూళ్లపై తనిఖీ చేసి సంబంధిత పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బయన్న, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు

కాలనీల్లో మున్సిపల్ కార్మికుల పాదయాత్ర


డ్రైనేజీ కాల్వ చూపుతున్న యూనియన్ నాయకులు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని తిలక్ నగర్, అరుంధతి నగర్‌లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర నిర్వహించారు. నగర గౌరవాధ్యక్షుడు చంద్రారెడ్డి. జిల్లా ఉపాధ్యక్షుడు కె.తిరుపాల్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీరాములు, సహాయ కార్యదర్శి ఇ.ప్రకాష్ మాట్లాడుతూ తిలక్ నగర్ గాంధీ రోడ్ గంగమ్మ గుడి వెనుక వర్షపు నీరు పోయేందుకు పెద్ద కాల్వ తవ్వినా తగిన సదుపాయాలు కల్పించలేదన్నారు. కార్మికులకు కార్పొరేషన్ నుండి హౌసింగ్ లోన్ ఇప్పించాలన్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా మోకాళ్ల లోతు వర్షం నీరు నిలబడుతోందని, చాలాచోట్ల వీధి దీపాలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అరుంధతీ నగర్‌లో డ్రైనేజీ కాల్వ 18 అడుగుల వెడల్పుతో నిర్మించారని, గోడల ఎత్తు పెంచకపోవడంతో పిల్లలు కాలువలో పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. నాగరాజ్, మహేంద్ర, రాముడు, చిన్నగంగయ్య, శివకుమార్, హరిక్రిష్ణ, రాజు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాలి


మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరంలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి పేర్కొన్నారు. మార్నింగ్ విజిట్ లో భాగంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.ఎస్.రమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ధనలక్ష్మి, విజయ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి ఈస్ట్, సౌత్ జోన్‌లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను వారు పరిశీలించారు. క్లాప్ ఆటోలను తనిఖీ చేసి.. వాహనం సామర్థ్యం మేరకు ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలన్నారు. ఉక్కయ్యపల్లిలోని ఎకో పార్క్ సందర్శించి..ప్రజలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్ఆర్ హిల్ వ్యాలీకి వెళ్లే రోడ్, సంజన్న సర్కిల్‌లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అన్న క్యాంటీన్ తనిఖీ చేసి భోజనం నాణ్యత గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగసుబ్బయ్య, పూజిత్ రెడ్డి, రాజా పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ మహోత్సవం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్

కడప అర్బన్: గ్రామీణ భారత్ మహోత్సవంలో భాగంగా కడప నేక్‌నామ్ కళా క్షేత్రంలో దాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్పత్తిదారులచే నేరుగా అమ్మకాలు జరిపే కార్యక్రమాన్ని జడ్జి బాబా ఫక్రుద్దీన్ బుధవారం ప్రారంభించారు. ఆయనతోపాటు హాజరైన రాజంపేట పోక్సో జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్, జడ్జి ప్రత్యూష మాట్లాడుతూ దాస్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఐదేళ్లుగా వివిధ జిల్లాల్లో తయారయ్యే హస్త కళా వస్తువులు, చేనేత వస్త్రాలు, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహిస్తోందన్నారు. రోజూ సాయంత్రం ప్రదర్శన స్థలంలో నాబార్డు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరపడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం విజయవిహారి, ఓబులదాస్, జానుమద్ది విజయభాస్కర్, జె.సురేష్, సహాయం, షేక్ అరుణ్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలకు అడ్డంగా వాహనాలు పెడితే చర్యలు


తోపుడు బళ్లను తీయిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు

కడప అర్బన్: కడప నగరంలోని పాత బస్టాండు, ఇతర ప్రాంతాల్లో దుకాణాలకు అడ్డంగా వాహనాలు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు హెచ్చరించారు. ఎస్సై, తన సిబ్బందితో కలిసి పాత బస్టాండు, వైవీ స్ట్రీట్, సెవెన్‌రోడ్స్ ప్రాంతాలలో దుకాణాలను బుధవారం పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు, తోపుడుబళ్లను ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేయడంతో వాటిని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనదారులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. విరుద్ధంగా ప్రవర్తిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.

ఘనంగా బర్సీ మహోత్సవం

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా–ఏ–గఫారియాలో శ్రీ హజరత్ దస్తగిరి షా ఖాద్రి బర్సీ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం దర్గా పీఠాధిపతి, సజ్జాదే నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో అశేష భక్త జన సందోహం నడుమ బర్సీ మహోత్సవాన్ని నిర్వహించారు. పీఠాధిపతి ఇంటి నంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో గంధంను ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. ఊరేగింపు దర్గా చేరుకున్న భక్తులు పీఠాధిపతి ఆధ్వర్యంలో స్వామి వారి మజార్లపై పూల చాదర్ సమర్పించి, గంధం ఎక్కించారు. పీఠాధిపతి భక్తులందరికి గంధం పంపిణీ చేశారు.

అమ్మా శాంభవి..అన్నపూర్ణాదేవి


పార్వతీదేవిగా జగన్మాత బాల పోలేరమ్మ


సత్యదేవుని ఆలయంలో రాధాకృష్ణులుగా


గాయత్రీదేవిగా లలితాంబిక అమ్మవారు

కడప సెవెన్‌రోడ్స్: నగరంలో శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం వైభవోపేతంగా జరిగాయి. విద్యుద్దీపకాంతుల వెలుగులో నగరంలోని అమ్మవారి ఆలయాల్లో ఉత్సవ శోభ ఉట్టిపడుతోంది. భక్తులు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఏడు గంటలకే నిర్వాహకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల సంఖ్య ఎక్కువ కావడంతో దర్శనాల కోసం వేచియుండాల్సి వస్తోంది. సాయంత్రం నుంచి ఆలయాల సమీపవీధులు జనసంద్రాలయ్యాయి. దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవారు చిన్న ప్రభ వాహనంపై దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అన్నపూర్ణదేవిగా అలంకరించారు. విజయదుర్గాదేవి ఆలయంలో చంద్రఘంటగా, గడ్డిబజారు సత్యదేవుడి ఆలయంలో రాధాకృష్ణగా, కామకోటి కళాంబదేవి ఆలయంలో పార్వతీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చిన్నబెస్తవీధిలోని బాలపోలేరమ్మ ఆలయంలో పార్వతీదేవిగా, లలితాంబిక ఆలయంలో గాయత్రీదేవిగా తీర్చిదిద్దారు. నాగరాజుపేటలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో బాలా త్రిపురసుందరీదేవిగా, నడివీధి గంగమ్మను అన్నపూర్ణాదేవిగా కొలువుదీర్చారు. భావనారుషి ఆలయంలో అమ్మవారిని వినాయకిదేవిగా అలంకరించారు. పలు గంగామాత ఆలయాలు, చౌడేశ్వరీమాత ఆలయాలలో భక్తులు విశేష పూజలు జరిపారు.


విజయదుర్గాదేవి ఆలయంలో చిన్నారుల కోలాటం


చిన్నప్రభ వాహనంపై కడప రాయుడు